సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 16, ఆగస్టు, 2023



సంప్రదాయ పూజలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి.

- 8లో



భాగస్వాములు కావాలి

దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు.

- 10లో



పోలీసుల అదుపులో..

శాలిగౌరారం మండలానికి చెందిన చిట్టీల వ్యాపారి సత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

- 10లో

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



జెండా ఆవిష్కరిస్తున్న గోద శ్రీరాములు

భువనగిరిటౌన్: స్వాతంత్య్రం వచ్చి నేటికి 77 ఏళ్లు అవుతున్నా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆరోపించారు. మంగళవారం భువనగిరిలోని సీపీఐ కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, మండల కార్యదర్శి ముదిగొండ రాములు, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాష్, జిల్లా కార్యదర్శి ఎస్‌కే షర్ఫుద్దీన్ వాహబ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, పట్టణ నాయకులు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న మహేంద్రకుమార్

బీబీనగర్: బీబీనగర్ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో చేపట్టిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను మంగవారం జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్ పరిశీలించి, ఆలయ రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఈఓ నరేందర్‌రెడ్డి, మేనేజర్ వెంకటేష్, చైర్మన్ లక్ష్మీ పద్మావతిశ్రీనివాస్, ధర్మకర్తలు ఉన్నారు.

అన్ని రంగాల్లో ప్రగతి





కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న గొంగిడి సునీత)



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

- వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు
- రైతుబంధు కింద ఈ సీజన్‌లో రైతుల ఖాతాల్లో రూ.212.30 కోట్లు జమ
- ఫ్లోరైడ్ రహిత జిల్లాగా యాదాద్రి
- స్వాతంత్య్ర దినోత్సవంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

సాక్షి,యాదాద్రి: జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 77వ స్వాతంత్య్ర దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమ ప్రగతిని వివరించారు.

ఈ సీజన్‌లో 2,58,378 ఎకరాల్లో పంట సాగు

జిల్లాలో 2023 వానాకాలంలో 2,58,378 ఎకరాల్లో పంట సాగు జరిగిందన్నారు. రైతుబంధు పథకం కింద ఈ సీజన్‌లో 2,27,399 మంది రైతుల ఖాతాల్లో రూ.212.30 కోట్లు జమ చేశామని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.307.44 కోట్లు జమ అయ్యాయన్నారు. నివాస స్థలం ఉండి ఇల్లు లేని వారికి గృహ లక్ష్మి పథకంలో భాగంగా 8,400 ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 34,750 దరఖాస్తులు వచ్చాయని ఈ నెల 20 లోపు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. రూ.46.9 కోట్లతో యాదగిరిగుట్ట, చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారన్నారు. జిల్లాలోని 5 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ (వాటర్ గ్రిడ్) పథకం కింద రూ. 883.92 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాను ఫ్లోరైడ్ రహిత జిల్లాగా ప్రకటించామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా రూ. 591.13 కోట్లతో చేపట్టిన ప్యాకేజీ-15 పనులు 69 శాతం పూర్తయ్యాయన్నారు. ప్రధాన కాలువ పురోగతిలో ఉన్నదని తెలిపారు. రూ. 685.75 కోట్లతో చేపట్టిన ప్యాకేజీ- 16 పనులు 65 శాతం పూర్తయ్యాయన్నారు. నృసింహ సాగర్ 11.39 టీఎంసీల సామర్థ్యంతో రూ.1,557.69కోట్లతో చేపట్టిన ప్యాకేజీ పనులు 89 శాతం పూర్తి చేశామన్నారు.

ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు

రోడ్డు ప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా జిల్లాలోని ప్రధాన పట్టణాలైన భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్టలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ వర్గాలకు ఆస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్ పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, జెడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీపీ రాజేశ్ చంద్ర, గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్, రైతు బంధు చైర్మన్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య, జెడ్పీటీసీలు డాక్టర్ నగేష్, సుబ్బూరు బీరుమల్లయ్య, తోటకూర అనురాధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీసీబంధుకు మొదటి విడతగా రూ.6కోట్ల నిధులు మంజూరు

ఆసరా పింఛన్లలో భాగంగా మొత్తంగా 1,03,984 మంది లబ్ధిదారులకు పింఛన్ ఇస్తున్నామన్నారు. దళితబంధు పథకం కింద 413 దళిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున రూ.41.30 కోట్లు మంజూరు చేశామన్నారు. 205 గిరిజన రైతులకు పోడు భూముల పాస్‌బుక్కులు పంపిణీ చేశామన్నారు. బీసీబంధు కింద ప్రతి నియోజకవర్గంలో మొదటి విడతలో భాగంగా 300 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున రూ.6కోట్లు మంజూరయ్యాయన్నారు. ముస్లిం మహిళలకు 300, క్రిస్టియన్ మహిళలకు 30 కుట్టు మిషన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ధరణిలో భాగంగా మొత్తం 64,527 దరఖాస్తులు రాగా 59,630 దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు.

నేతన్న చేయూతకు రూ.41.63కోట్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం కింద జిల్లాకు 3,464 ఇళ్లు మంజూరు కాగా అర్హులైన 769 మందిని ఎంపిక చేశామన్నారు. గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రూ. 232 కోట్ల వ్యయంతో 18, 655 గొర్రెల యూనిట్లు 75శాతం సబ్సిడీపై పంపిణీ చేశామన్నారు. రెండవ విడతలో 710 గొర్రెల యూనిట్లు పంపిణీ చేశామన్నారు. నేతన్నకు చేయూత పథకం ద్వారా 11,888 మంది చేనేత కార్మికులకు రూ.41.63కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. చేనేత మిత్ర పథకం ద్వారా 11,220 మంది కార్మికులకు 40 శాతం నూలు సబ్సిడీతో రూ. 18.15 కోట్లు విడుదల చేశామన్నారు. పోచంపల్లి మండలం కనుముక్కలలో మూతపడిన చేనేత పార్కును రూ.12.68 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు.



నృత్యం చేస్తున్న విద్యార్థిని



హార్టికల్చర్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు, పోలీసులు

ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

- నేడు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ రాక
- భువనగిరిలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం
- బల ప్రదర్శనకు సిద్ధమైన నాయకులు

సాక్షి, యాదాద్రి: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం భువనగిరిలో జరుగనుంది. పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్, కర్ణాటకలోని హంగల్ ఎమ్మెల్యే శ్రీనివాస్ మానే, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మరికొందరు ముఖ్యనాయకులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి కాంగ్రెస్‌కు చెందిన అన్ని విభాగాల నాయకులు సమావేశంలో పాల్గొంటారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన వారితోపాటు రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు, పీసీసీ ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో పోటీచేయాలనుకునే వారి నుంచి పార్టీ కోఆర్డినేటర్ దరఖాస్తులు తీసుకోనున్నారు. దీంతో నాయకులు బలపదర్శనకు సిద్ధమయ్యారు. ఎంత మంది పోటీ చేయడానికి ముందుకు వచ్చినా దరఖాస్తులను తీసుకోనున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తే విజయావకాశాలు ఉంటాయని తెలుసుకుంటారు. ఉదయం 11 గంటలకు భువనగిరిలోని సాయి కన్వెన్షన్‌లో సమావేశం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రామన్నపేట ప్రభుత్వాస్పత్రికి మహర్దశ

- నూతన భవన నిర్మాణానికి రూ.5.75కోట్లు మంజూరు
- రోగులకు తీరనున్న అవస్థలు



శిథిలావస్థకు చేరుకున్న రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి భవనం



మంత్రి హరీశ్‌రావ్‌కు ఆస్పత్రి భవనం స్థితిగతులను వివరిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య (ఫైల్)

రామన్నపేట: శిథిలావస్థలో ఉన్న రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి మహర్దశ చేకూరనుంది. నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5.75కోట్లు మంజూరు చేసింది. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ఆరోగ్య కు టుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఎస్‌ఏఎం రిజ్వీ నిధులు మంజూరుకు 14వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు.

53 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం కావడంతో..

53 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆస్పత్రి భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. భవనాల పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. వర్షపునీరు వార్డులు, గదుల్లోకి చేరుతోంది. ఫ్లోరింగ్, డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతిన్నది. గోడలకు పగుళ్లు వచ్చాయి. ఆపరేషన్ థియేటర్‌లోనూ ఇదే పరిస్థితి. ఎలక్ట్రికల్ వైరింగ్ కూడా అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలం కావడంతో ఎక్కడ పెచ్చులూడి మీద పడతాయేమోనని ఇన్‌పేషెంట్లు భయపడుతున్నారు. ఆస్పత్రి భవనాల దుస్థితిని గమనించిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నూతన భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు కోసం సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి సమస్యను వివరించారు. ఈమేరకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఎస్‌ఏఎం రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నూతన భవనాల నిర్మాణంతో రోగుల వ్యథలు తీరనున్నాయి.

సీఎం, మంత్రుల సహకారంతో నిధులు

నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావ్, జగదీష్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిది. అడిగిన వెంటనే ఆస్పత్రిలో నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రజల పక్షాన ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు. వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తిచేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. రాబోయే రోజుల్లో ఆస్పత్రి స్థాయిని పెంచేందుకు ప్రయత్నిస్తాను.

– చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే నకిరేకల్

రోజుకు 500 మంది వరకు అవుట్ పేషెంట్ల రాక..

రామన్నపేట పాత నియోజకవర్గకేంద్రంలో 1970లో 30 పడకలతో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, మోత్కూరు, ఆత్మకూరు(ఎం), వలిగొండ, చౌటుప్పల్ మండలాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తోంది. రోజుకు 300 నుంచి 500 మంది వరకు అవుట్ పేషంట్లు వస్తుంటారు. బెడ్లు సరిపోకపోవడంతో 1999లో ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచారు. అదే విధంగా 2012లో ఏరియా ఆస్పత్రిగా మారుస్తూ 23 డాక్టర్ పోస్టులు మంజూరు చేశారు.

వార్డుల్లోనే మున్సిపల్ సేవలు

- త్వరలో రానున్న వార్డు ఆఫీసర్లు
- ప్రస్తుతం 46 మంది వీఆర్‌ఏల సర్దుబాటు



భువనగిరి: మున్సిపాలిటీ సేవలు మరింత చేరువకానున్నాయి. ప్రభుత్వం వీఆర్‌ఏలను వివిధ శాఖలకు సర్దుబాటు చేయగా మిగిలిన వారిని మున్సిపాలిటీల్లోని వార్డు ఆఫీసర్లుగా కేటాయించింది. వీరితోపాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అధికారులను నియమించనుండడంతో మున్సిపాలిటీల్లో సేవలు మరింత పటిష్టం కానున్నాయి. ఇప్పటికే ఈ విధానాన్ని హైదరాబాద్‌లో అమలు చేస్తున్నారు. ఇదే మాదిరిగా అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేసేందుకు వార్డు ఆఫీసర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది.

వార్డు ఆఫీసర్ల వివరాలు

మున్సిపాలిటీ	వార్డు	వీఆర్‌ఏలు	టీఎస్‌పీఎస్‌సీ ద్వారా వచ్చేవారు
భువనగిరి	35	03	29
చౌటుప్పల్	20	12	18
ఆలేరు	12	08	04
మోత్కూర్	12	07	03
పోచంపల్లి	13	09	04
యాదగిరిగుట్ట	12	07	16

స్థానికంగానే ఉండి..

వీధి దీపాలు మరమ్మతులు, చెత్త చెదారం, పారిశుద్ధ్యం, రోడ్లపై గుంతలు వంటి ఎన్నో సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాలి. మున్సిపల్ కార్యాలయం దూరంగా ఉన్న వారు ఫిర్యాదు చేసేందుకు అక్కడికి వెళ్లలేకపోతున్నారు. ఫలితంగా సమస్యలు అలాగే ఉంటున్నాయి. వీటిని నివారించేందుకు ప్రభుత్వం వార్డు ఆఫీసర్లను నియమిస్తోంది. వారు స్థానికంగానే ఉండి అన్ని రకాల సేవలను అందించనున్నారు.

అందనున్న సేవలు..

అక్రమ నిర్మాణాల కూల్చివేత, రోడ్ల గుంతలను పూడ్చివేత, నీటి నిల్వలు తొలగించడం, పైపులో ఆగిన చెత్తను తొలగించడం వంటి పనులన్నీ వార్డు ఆఫీసర్ల ద్వారా పరిష్కారం అవుతాయి. పారిశుద్ధ్య సిబ్బందిని వీరికి అనుసంధానం చేయనున్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వార్డులోనే అందించడంతో పాటు ఆస్తి పన్ను బాధ్యత వీరే చూసుకుంటారు.

ప్రస్తుతం 46 పోస్టులు

జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు ఉండగా వాటిలో మొత్తం 104 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా మున్సిపాలిటీల్లో కొత్తగా 58 మంది వార్డు ఆఫీసర్ల నియామకానికి ప్రతిపాదించారు. ప్రస్తుతం 46 పోస్టుల్లో వీఆర్‌ఏలను సర్దుబాటు చేశారు. ఇందులో ఎక్కువగా చౌటుప్పల్ మున్సిపాలిటీకి వీఆర్‌ఏలను కేటాయిస్తూ సర్దుబాటు చేశారు. మిగిలిన పోస్టులను టీఎస్‌పీఎస్సీ ద్వారా నియమించనున్నారు.

కొన్ని పోస్టులు మంజూరు చేశారు

వార్డు ఆఫీసర్ల ఏర్పాటుపై ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతానికి పలు వార్డు ఆఫీసర్ల పోస్టులు మంజూరు చేయగా ఇప్పటికే కొంత మంది అధికారులు వచ్చారు. వారికి సంబంధించిన నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

నేటి నుంచి 'రుణమాఫీ' జమ

- డీసీసీబీ పరిధిలో రూ.లక్షలోపు రుణాలకు రూ.104 కోట్ల 7లక్షలు విడుదల
- ఇప్పటికే రూ.25 వేలలోపు రుణాలు రూ.14.87 కోట్లు మాఫీ
- 31 బ్రాంచీల్లో 36,205 మంది రైతులకు ప్రయోజనం

నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు లక్షలోపు పంట రుణాలను మాఫీ కోసం నిధులను విడుదల చేసింది. 2018 డిసెంబర్ 11వ తేదీలోపు తీసుకున్న పంట రుణంలో రూ.లక్షలోపు మాఫీ చేస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 31 బ్రాంచీల్లో పంట రుణాలను తీసుకున్న 36,205 మంది రైతులకు రుణమాఫీ వర్తించింది. రూ.99,999 వరకు పంట రుణాలు ఉన్న రైతులందరికీ ఖాతాల్లో బుధవారం నుంచి రుణమాఫీ డబ్బులను జమ చేయనున్నారు.

మూడేళ్ల క్రితమే రూ.25 వేలలోపు మాఫీ..

రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.25 వేలలోపు పంట రుణాలను మాఫీ చేసింది. అప్పట్లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 31 బ్రాంచీల్లో 13,666 మంది రైతులకు సంబంధించిన రూ.14.87 కోట్లు మాఫీ అయ్యాయి. కానీ గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ విషయంలో ఎటూ తేల్చకపోవడంతో రైతులు కొంత ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ధీమాలో అనేక మంది రైతులు పంట రుణాలను చెల్లించలేదు. చాలామంది కనీసం రెన్యూవల్ కూడా చేసుకోలేదు. దీంతో రైతులపై వడ్డీ భారం పడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి రూ.104 కోట్ల 7లక్షలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు విడుదల చేసింది. దీంతో సహకార సంఘాల ద్వారా పంట రుణాలను తీసుకున్న రైతులకు ఊరట లభించింది. నల్లగొండ జిల్లాలోని 14 బ్రాంచీలు, సూర్యాపేట జిల్లాలో 9, యాదాద్రిభువనగిరి జిల్లా పరిధిలోని 8 బ్రాంచీల పరిధిలో కలిపి మొత్తం 31 బ్రాంచీల్లో 22,539 మంది రైతులకు లబ్ధి చేకూనుంది.

రెండు దఫాల్లో 36,205 మందికి..

మొదటి దఫా, రెండో దఫాలలో కలిపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన 36,205 మంది రైతులకు సంబంధించిన పంటరుణాలు రూ.118 కోట్ల 94లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేసింది. నెలాఖరులోగా మాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయడానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు చర్యలు చేపట్టారు. 2018 డిసెంబర్ 11లోపు పంటరుణాలను తీసుకుని తిరిగి చెల్లించిన రైతు ఖాతాల్లో కూడా రుణమాఫీ డబ్బులను జమచేయనున్నారు. ఆ రైతులు తిరిగి ఖాతాల నుంచి డబ్బులు తీసుకోవచ్చు.

అంబరాన్నంటిన సంబురం

నల్లగొండలో


స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని నల్లగొండలో స్వాతంత్య్ర సమరయోధులను సత్కరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి


నల్లగొండలోని జెడ్పీహెచ్‌హెచ్‌ఎస్ విద్యార్థినుల జెండా ప్రదర్శన


గౌతమి మోడల్ స్కూల్ విద్యార్థుల ఆర్మీ జవాన్ల యుద్ధ ప్రదర్శన


వేడుకలకు హాజరైన అవార్డు గ్రహీతలు, అధికారులు తదితరులు

సూర్యాపేటలో


స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని సూర్యాపేటలో స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


రైతుబంధు శకటం ప్రదర్శిస్తున్న సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


స్వయం సహాయక సంఘాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భువనగిరిలో


యాదాద్రి కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర వేడుకల్లో పరేడ్ చేస్తున్న పోలీసులు



సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


జిల్లా మహిళా సమాఖ్య అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యే గాదరి కిశోర్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి


దివ్యాంగులకు సహాయ పరికరాలు పంపిణీ చేసిన విప్ గొంగిడి సునీత, చిత్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్ర

ఉత్తమ సేవలకు గుర్తింపు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని ఆయా శాఖల అధికారులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పాల్గొని వివిధ శాఖల అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రభుత్వ విప్ గొంగిడి సునీత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనాథ్


ఎం. నాగేశ్వరాచారి, పరిపాలనా అధికారి
టి. పృథ్వీ, సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ, కలెక్టరేట్
ఆర్. ప్రణయ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్, మోత్కూర్
ఎండీ యజ్దాని, సూపరింటెండెంట్, సీపీఓ రాచకొండ
ఉప్పునూతల సత్యం, హెడ్ కానిస్టేబుల్, ఇంటలిజెన్స్


కె. శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్, సీపీఓ రాచకొండ
కె.రాకేష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్, సీపీఓ రాచకొండ
దప్పు జంగయ్య, ఐటీ సెల్, డీసీపీ కార్యాలయం, యాదాద్రి
వై. ఆనంద్ కుమార్, హెడ్ కానిస్టేబుల్, స్పెషల్ బ్రాంచ్
జీను మత్స్యగిరి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు


ఎం. సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్, చౌటుప్పల్ పీఎస్
కె. చంద్రశేఖర్, కానిస్టేబుల్, ఎస్‌ఓటీ, భువనగిరి
బి. వీరబాబు, కానిస్టేబుల్, యాదగిరిగుట్ట
బి.కొండారెడ్డి, కానిస్టేబుల్, భువనగిరి టౌన్
ఎ. అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్, భువనగిరి
బి. వెంకటేష్, డిప్యూటీ సర్వేయర్, అడ్డగూడురు
కె. ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, యాదగిరిగుట్ట


ఎన్. కమలాకర్, సీనియర్ అసిస్టెంట్, చౌటుప్పల్
బి. రవీంద్ర నాయక్, జూనియర్ అసిస్టెంట్
ఎస్‌డీ షరీఫ్ బాబా, ఆఫీస్ సబార్డినేట్
ఎం. మురళి, ఐకేపీ కోఆర్డినేట్, డీఆర్‌డీఓ కార్యాలయం
ఆర్. మీనా, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, డీఆర్‌డీఓ కార్యాలయం


సయ్యద్ షోయబుల్లా, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఆలేరు
ఎండీ. అబ్దుల్ హమీద్, ఫైర్ ఆఫీసర్ డ్రైవర్, భువనగిరి
వై. దీప్తి, ఎంపీఓ, బీబీనగర్
వై. శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ గ్రేడ్-2 ఆఫీసర్, టీఎస్‌సీఎస్‌సీఎల్, భువనగిరి
డాక్టర్ గుగులోతు యాదగిరి, పీహెచ్‌సీ, బీబీనగర్
ఏ. ఝాన్సీలక్ష్మి, పీహెచ్‌సీ, తంగడపల్లి
డాక్టర్ నిర్మల, సీఏఎస్‌ఎస్, సూపరింటెండెంట్, భువనగిరి
డాక్టర్. సాయికిరణ్, సీఏఎస్‌ఎస్, అనస్తీషియా, భువనగిరి
రాజిరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి
ఎస్. సంతోష్ కుమార్, ఎంపీఎస్ఓ, తహసీల్దార్, మోటకొండూర్
ఎం. స్వామి, ఆఫీస్ సబార్డినేట్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, యాదాద్రి
క్రాంతికుమార్‌గౌడ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, జిల్లా కోఆపరేటివ్ ఆఫీస్
వి.లక్ష్మి, సీనియర్ ఇన్‌స్పెక్టర్, జిల్లా కోఆపరేటివ్ ఆఫీస్


ఎన్. చంద్రయ్య, గ్యాంగ్ మజ్దూర్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం
ఎస్. రాజీవ్‌కుమార్, సూపర్‌వైజర్, జిల్లా మార్కెట్ కార్యాలయం
షేక్ అబ్దుల్ మజీద్, డేటా ఎంట్రీ ఆపరేటర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయం
మామిడి హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్, ట్రాఫిక్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం
ఆర్. హనుమానాయక్, అసిస్టెంట్ ఇంజనీర్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం
వి. సిద్ధిరాములు, కండక్టర్
ఏ. ప్రతిమా, సబ్ ట్రెజరీ ఆఫీసర్
టి. భాస్కర్, 108 టెక్నీషియన్
ఎస్. రమేష్‌బాబు, పీడీ మెప్మా
కె. నాగార్జున, ఏఎస్‌ఐ, ఇంటలిజెన్స్
దానియేల్, హెడ్ కానిస్టేబుల్, ఇంటలిజెన్స్
జి. వినోద్ కుమార్, కానిస్టేబుల్, ఇంటలిజెన్స్
కె. హనుమాన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, చౌటుప్పల్ మున్సిపాలిటీ

వ్యక్తి అదృశ్యం

నార్కట్‌పల్లి: మండలంలోని బి.వెల్లంల గ్రామానికి చెందిన చెన్నారపు అంజయ్య అదృశ్యమైనట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. అంజయ్య ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా సీఎం సభ

- సీఎం నిర్ణయాలతో విపక్షాలకు షాక్
- సన్నాహక సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి


సీఎం కేసీఆర్ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ తదితరులు

సూర్యాపేట: చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 20న సూర్యాపేటలో సీఎం కేసీఆర్ సభను నిర్వహిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సభను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పోడు భూములకు పట్టాలు ఇవ్వడం, వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించడంలాంటి నిర్ణయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకోవడంతో విపక్షాలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయని, ఆ షాక్ నుంచి ఇప్పుడిప్పుడే విపక్షాలు కోలుకునేలా లేవని వ్యాఖ్యానించారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాగా మారిన సూర్యాపేటలో ఊహకందని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. ఆ క్రమంలో నూతనంగా నిర్మించిన కలెక్టర్ కార్యాలయ భవన సముదాయం, ఎస్పీ కార్యాలయం, సమీకృత మార్కెట్ భవనంతో పాటు మెడికల్ కళాశాలను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. 12 అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసి ఉమ్మడి నల్లగొండ జిల్లా కేసీఆర్ ఖిల్లాగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఈ 12 స్థానాల్లో ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగేందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, శానంపూడి సైదిరెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎన్. భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, యాదాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి,యాదాద్రి: యాదాద్రి కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో కేజీబీవీ, గంజ్ హైస్కూల్, దివ్యబాల, విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తదితరులు అభినందించారు. అదేవిధంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన 77 ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం 2750 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.169 కోట్ల రుణాలు అందజేశారు. మెప్మాకు సంబంధించి 310 సంఘాలకు రూ.30.10 కోట్ల రుణాలు అందజేశారు. వీధి వ్యాపారులకు రూ.2.78 కోట్లు ఇచ్చారు.

స్టాల్స్ పరిశీలన..

కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యానవన, రోడ్లు భవనాలు, మహిళా శిశు సంక్షేమం ఎస్సీ, మైనారిటీ సంక్షేమం, నీటిపారుదల, సహకార, మత్స్యశాఖ, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, గ్రామీణ అభివృద్ధి, మెప్మా, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రభుత్వ విప్ సునీత తదితరులు సందర్శించారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. అంతేకాకుండా ఆలయానికి క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆలయ ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని సింధూరంతో ప్రత్యేకంగా అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం అంజనీపుత్రుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించారు. ఇక ప్రధానాలయంలో సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా చేపట్టారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు వైభవంగా నిర్వహించారు.

బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడి

భువనగిరి : భువనగిరి మండలం వీరవెల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. అక్కడ విక్రయిస్తున్న రూ. వేలు విలువ చేసే వివిధ రకాల కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన చిన్నబత్తిని జోసెఫ్, బీమరి మధులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగప్రసాద్ తెలిపారు.